క్లుప్తంగా

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన



క్యూ లైన్‌ను పరిశీలిస్తున్న రామచంద్రమోహన్

సింహాచలం : ఈ నెల 9న జరగనున్న గిరి ప్రదక్షిణ, 10న జరిగే ఆలయ ప్రదక్షిణ వేడుకలను పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శనివారం పరిశీలించారు. ఆయన దేవస్థానం ఈవో త్రినాథరావు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సింహగిరిపై పలు ప్రాంతాల్లో పర్యటించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. క్యూలలో భక్తులకు మంచినీటిని విరివిగా అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం కల్పించాలని, క్యూలో భక్తులు నిరంతరం నడుస్తూనే ఉండాలని, ఎక్కడా రద్దీ ఏర్పడకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు రమణ, రాంబాబు, డీఈ రామరాజు, ఏఈఈ రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలి

పరవాడ: ప్రతి గ్రామంలోనూ ఏకాదశి రోజున నగర సంకీర్తన, పౌర్ణమి రోజున సామూహిక హారతి కార్యక్రమాలను దేవాలయాల కేంద్రంగా చేపట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి అన్నారు. పరవాడ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆషాఢ మాసంలో చేపట్టవలసిన గోరింటాకు, అమ్మవారికి చీర సమర్పణ వంటి కార్యక్రమాల విశిష్టత గురించి బొద్దపు సూకరత్నం వివరించారు.

గొరపల్లిలో వరి విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందిస్తున్న సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను

పెందుర్తి: ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలను మండలంలోని గొరపల్లిలో శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను, గవరపాలెం సర్పంచ్ కొయిలాడ శ్రీను, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, జనసేన మండల అధ్యక్షుడు కోరుపోలు రామునాయుడు హాజరై రైతులకు వరి విత్తనాలను అందించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

40 మంది మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 40 మందికి కోర్టు రూ.4 లక్షల జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శనివారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఈ తీర్పును వెలువరించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సేవలతోనే సంతృప్తి



కేక్ కట్ చేస్తున్న చందుయాదవ్

పెందుర్తి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సింహచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు కోరాడ చందుయాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం పురుషోత్తపురంలోని తన నివాసంలో నాయకులు, అభిమానుల మధ్య చందు కేక్ కట్ చేశారు. సేవలతోనే సంతృప్తి ఉంటుందని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నేడు వంగలిలో ఉచిత కంటి వైద్య శిబిరం

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వెంకట సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ క్యాంప్ మేనేజర్ ఎం. అరుణ్ కుమార్ శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో జరిగే ఈ శిబిరాన్ని గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో అన్ని రకాల కంటి వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేస్తారని ఆయన పేర్కొన్నారు.

- ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెంలో కనీస సౌకర్యాలు శూన్యం
- మత్స్యకారులను పట్టించుకోని నాయకులు, అధికారులు
- కూలిపోయేందుకు సిద్ధంగా సామాజిక భవనాలు
- భారంగా మారిన చేపల వేట

సమస్యల తీరంలో బెంగపుత్రులు



టన్నుల బరువు కలిగిన తెప్పను తీరానికి మోసుకొస్తున్న మత్స్యకారులు



ముత్యాలమ్మపాలెంలో కూలడానికి సిద్ధంగా ఉన్న సామాజిక భవనం



రోడ్డుపై ఎండబెట్టిన చేపలు



మరమ్మతులకు గురైన సామాజిక భవనం

పరవాడ: చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని 792 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు సుమారు 90 పడవలతో సముద్రంపై చేపల వేట సాగిస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. అయితే వీరు అనేక మౌలిక సదుపాయాల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఐస్ ప్లాంటు కొరత

పచ్చి చేపలను నిల్వ చేయడానికి అవసరమైన కనీస సౌకర్యాలు లేక మత్స్యకారులు అవస్థలు పడుతున్నారు. ఐస్ ప్లాంటు అందుబాటులో లేకపోవడంతో 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరవాడకు వెళ్లి ఐస్ తీసుకురావాల్సి వస్తుందని వాపోతున్నారు.

సామాజిక భవనాల దుస్థితి

తీరంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రెండు సామాజిక భవనాలు కూడా ఆలనా పాలనా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 15 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలకు చిన్న వర్షం పడినప్పటికీ స్లాబులు కారిపోతున్నాయి. శ్లాబులు పెచ్చులూడిపోయి, గచ్చులు పాడైపోయాయి. పిల్లర్ల పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటపడటంతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని మత్స్యకార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఏడేళ్ల క్రితం వలలు కుట్టుకోవడా నికి నిర్మించిన భవనం కూడా మరమ్మతుల కోసం ఎదురుచూస్తోంది. ఈ భవనంలోని గచ్చులు పూర్తిగా పాడయ్యాయి. అలాగే భవనానికి అమర్చిన విద్యుత్ లైట్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు ఉప్పుగాలికి తుప్పుపట్టి పోయాయి. మత్స్యకారులు తమ సమస్యలను పరిష్కరించాలని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలావస్థలో వేట సామగ్రి భద్రతా భవనాలు

చేపల వేట సామగ్రి (వలలు, ఇంజన్లు) భద్రపరచుకోవడానికి నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. తుఫానులు వంటి అత్యవసర సమయాల్లో తమ సామగ్రిని భద్రపరచుకోవడానికి భయం భయంగా గడపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు గురైన ప్లాట్‌ఫారాలు



బీటలు వారిన ఎండు చేపల ప్లాట్‌ఫారం

వేటలో లభ్యమైన చిన్న చేపలను ఎండబెట్టడానికి నిర్మించిన ప్లాట్‌ఫారాలు మరమ్మతులతో ఉన్నందున రోడ్లు, ఇసుక తెన్నలపై ఆధారపడాల్సి వస్తుందంటున్నారు. మరో రెండు ప్లాట్‌ఫారాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి.

కూలిపోయే స్థితిలో భవనాలు



గంగపుత్రుల అవసరాల కోసం తీరంలో నిర్మించిన రెండు సామాజిక భవనాలు, ప్లాట్‌ఫారాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాలకు ఎలాంటి మరమ్మతులూ చేపట్టకపోవడంతో పిల్లర్లు, శ్లాబులు దెబ్బతిన్నాయి.ఈ భవనాలు ఏ క్షణంలో కూలిపోతాయోనన్న భయం వెంటాడుతోంది. ముఖ్యంగా పిల్లర్ల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. భవనాలకు, ప్లాట్‌ఫారాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలి.

–వాసుపల్లి బంగారి, మత్స్యకారుడు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



మత్స్యకారులు వలలు అల్లుకునే భవనంలో విద్యుత్ సౌకర్యం లేక రాత్రివేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భవనానికి గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సదుపాయం పూర్తిగా పాడైపోవడంతో చీకటి పడగానే అంధకారం అలముకుంటుంది. దీంతో విష పురుగులు భవనంలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రిపూట భవనంలోకి అడుగు పెట్టాలంటే భయంగా ఉంది. తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించి, స్వల్ప మరమ్మతులు చేపట్టాలి.

–కొవిరి పరదేశి, మత్స్యకారుడు

పట్టించుకోని పాలకులు



తమ సమస్యలను పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరిన భవనాలు, ప్లాట్‌ఫారాలను బాగు చేయాలని కోరినా అధికారులు స్పందించడం లేదు. భవనాలు మరింత శిథిల దశకు చేరుకుంటున్నాయి. అవి కూలిపోతే తమకు నిలువ నీడ లేకుండా పోతుంది. మత్స్యకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

–తిత్తి పెంటయ్య, మత్స్యకారుడు

సింహగిరిపై విశేషంగా శ్రీనృసింహ హోమం



శ్రీ నృసింహ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కుంభప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రధాన కలశను శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు శాస్త్రోక్తంగా హోమాన్ని నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను వేంజేంపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద కూర్చోబెట్టారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె. రామచంద్రమోహన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుది విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి తుదివిడత చందనం అరగదీత కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీన ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి సమర్పించనున్న మూడు మణుగుల (సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సిద్ధం చేసేందుకు ఈ అరగదీత చేపట్టారు. ఉదయం చందనం చెక్కలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 15 మంది నాలుగో తరగతి సిబ్బంది 36 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో రెండు రోజుల పాటు ఈ చందనం అరగదీత కొనసాగనుంది. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూడిక తొలగించండి



మెట్టపాలెంలో అధ్వానంగా మారిన మురుగు కాలువ

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామంలో మురుగు కాలువల దుస్థితి అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలన్నీ పూడికలతో నిండిపోయి, దట్టంగా పెరిగిన తుప్పలు, గడ్డితో నీరు ప్రవహించకుండా నిలిచిపోతోంది. దీని ఫలితంగా వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి, దుర్గంధాన్ని వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్న ఈ అపరిశుభ్ర పరిస్థితుల కారణంగా తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని వారు వాపోతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడానికి పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. మురుగు కాలువల దుస్థితిపై సర్పంచ్ కె.వరలక్ష్మి సీతారామయ్య తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్షన్లు, రేషన్ కార్డుల సమస్యలు పరిష్కరించాలి



ఐద్వా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

పరవాడ : కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, వీధి కాలువల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం డిమాండ్ చేశారు. దేశపాత్రునిపాలెంలో శనివారం జరిగిన ఐద్వా కమిటీ పదో మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని ఆమె కోరారు. అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో అనంతపూర్‌లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో ఐద్వా గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించి, అధ్యక్షురాలిగా మొండి జ్యోతి, కార్యదర్శిగా కర్రి రోషిణిలను ఎన్నుకున్నారు. సభ్యులుగా కె. శారద, భవాని, దేవి, లక్ష్మి, సంతు, రమణమ్మ, వేణులను ఎంపిక చేశారు.

ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు

పెందుర్తి : ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి బ్యాగుల నుంచి చాకచక్యంగా ఆభరణాలు దొంగిలించే ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు వెస్ట్ జోన్ క్రైమ్ ఏసీపీ డి. లక్ష్మణరావు వెల్లడించారు. ఈ చోరీ కేసు వివరాలను పోలీసులు మీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లా ద్వారపూడికి చెందిన గొలజాపు మోహిని ఏప్రిల్ 10న విశాఖ వచ్చింది. తిరుగు ప్రయాణంలో విజయనగరం బస్సు కోసం పెందుర్తి బస్టాప్‌లో వేచి ఉంది. అనంతరం బస్సు ఎక్కి టికెట్ డబ్బుల కోసం తన బ్యాగును తెరవగా, అందులోని 3 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకున్న పెందుర్తి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన మేకల సంధ్య అనే పాత నేరస్థురాలు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితురాలు సంధ్యను పట్టుకుని, ఆమె నుంచి రూ. 3 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఐకాన్ స్పోర్ట్స్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, నాయకులు

పరవాడ: చింతల గొర్లివానిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ సారథ్యంలో నెలకొల్పిన ఈ స్పోర్ట్స్ హబ్‌ను ఎంపీపీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గెడ్డం ఉమ మాట్లాడుతూ ఐకాన్ స్పోర్ట్స్ హబ్‌లో క్రికెట్, పికిల్‌బాల్, బ్యాడ్మింటన్, మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలకు సంబంధించిన అత్యాధునిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. క్రీడా నైపుణ్యం కలిగిన శిక్షకులతో ప్రత్యేక శిక్షణ అందిస్తామని, క్రీడాకారుల సౌలభ్యం కోసం ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసి రాజు, రావికమతం తహశీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో వ్యభిచార గృహంపై దాడి



నిందితులతో సీఐ సతీష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ భరత్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుజాతనగర్‌లో ఓ వ్యభిచార గృహంపై నగర టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు నిర్వాహకులతో పాటు ఓ విటుడిని అరెస్ట్ చేశారు. ఇద్దరు మహిళలను సంరక్షణ కేంద్రానికి తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పెందుర్తికి చెందిన భీశెట్టి ధనలక్ష్మి, ఆమె సహచరుడు వివేక్ సుజాతనగర్‌లోని రత్నగిరినగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వారికి పరిచయం ఉన్న మహిళలను అక్కడికి తీసుకువచ్చి, విటులను రప్పించి వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై పక్కా సమాచారం అందుకున్న నగర టాస్క్‌ఫోర్స్ , పెందుర్తి పోలీసులు ఆ వ్యభిచార గృహంపై దాడి చేసి, నిర్వాహకులైన భీశెట్టి ధనలక్ష్మి, వివేక్, ఓ విటుడిని అరెస్ట్ చేశారు. వ్యభిచార కార్యకలాపాల్లో ఉన్న ఇద్దరు మహిళలను సంరక్షణ నిమిత్తం స్వధార్ హోంకు తరలించారు. దాడుల్లో సీఐ కె.వి. సతీష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ భరత్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సెయిలింగ్ శిక్షణ

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం, తీర గస్తీ దళం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన ఓసియన్ సెయిలింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. గత నెల 23 నుంచి భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సర్కార్‌లోని వాటర్ మెన్ షిప్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌కి చెందిన 13 మంది సెయిలర్స్ ఈ శిక్షణలో పాల్గొన్నారు. సముద్ర జలాల్లో ఆపత్కాల సమయంలోనూ, విపత్తుల్లో చిక్కుకున్న వారికి రక్షించేలా తర్ఫీదునిచ్చారు. దీంతో పాటుగా సుదీర్ఘ సముద్రయానానికి సిద్ధమయ్యేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసంతో పాటు మెళకువలు నేర్పించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే కోస్ట్ గార్డ్ గోల్డెన్ జూబ్లీ మహా సముద్రయానానికి శిక్షణ తీసుకున్న వారిని సంసిద్ధులను చేసినట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

'శాప్' డైరెక్టర్లకు సత్కారం



శాప్ డైరెక్టర్‌గా ఎన్నికైన బుచ్చిరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్లుగా ఎన్నికైన పీవీఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు), మేడిది రమేష్‌కుమార్ (రాజా)లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ఘనంగా సత్కరించారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని ఔత్సాహిక క్రీడాకారులకు తగిన సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ, సహస్ర నామార్చన, రాజభోగం, సర్వదర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

నిబంధనలు మీరితే సహించబోం

- బొగ్గు, ఫ్లయాస్ రవాణా లారీల యజమానులకు పంచకర్ల హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: పరవాడ ప్రాంతంలో హిందుజా, ఇతర కంపెనీలకు బొగ్గు తరలించే లారీలు, ఎన్‌టీపీసీ నుంచి ఫ్లైయాష్ తరలించే లారీలు నిబంధనలు పాటించకపోవడంపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. సుజాతనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లారీలు టార్పాలిన్లు వేయకపోవడం, అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. లారీ యజమాన్యాలు నిబంధనలు పాటించకుంటే సహించేది లేదని, తీవ్ర చర్యలకు సిఫార్సు చేస్తామని, అవసరమైతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని రమేష్‌బాబు స్పష్టం చేశారు. అధిక లోడుతో, కనీస నిబంధనలు పాటించకుండా నడుస్తున్న ఈ వాహనాల వల్లే ఇటీవల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించబోమని హెచ్చరించారు. పోలీసులు, ఇతర అధికారులు ఈ వాహనాలను నియంత్రించాలని, సిఫార్సులు వచ్చినా నిబంధనలు మీరిన వారిని విడిచిపెట్టవద్దని సూచించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 – పీ4 (జీరో పావర్టీ)పై ఎమ్మెల్యే రమేష్‌బాబు సమీక్ష నిర్వహించారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో నియోజకవర్గ స్వచ్ఛ ఆంధ్ర ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ సత్తిబాబు, జోన్–6, 8 జడ్సీలు శేషాద్రి, హేమావతి, పెందుర్తి, పరవాడ, సబ్బవరం ఎంపీడీవోలు అప్పలరాజు, పద్మజ, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న భగవాన్ సత్యసాయి భక్త బృందం ప్రతినిధులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని భగవాన్ సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పాపయ్యరాజుపాలెం, గొల్లవిల్లివాని పాలెం, పురుషోత్తపురం, గిరిప్రసాద్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రబ్బర్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బి. జ్యోతి, ముక్కా గోపి, పి. తాతారావు, టి. సీతారామయ్య, పి. రమణమ్మ, సిహెచ్. భవానీ, ఎ. నాగమణి, వి. రామలక్ష్మి తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు, రేపు కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కిరండూల్ మార్గంలో నడిచే రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

- ఈ నెల 6,7వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

పూరీ రథయాత్ర స్పెషల్ రద్దు

రేక్ అందుబాటులో లేని కారణంగా విశాఖపట్నం–పూరీ–విశాఖపట్నం మధ్య నడిచే స్పెషల్ రైలును రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 6వ తేదీన విశాఖపట్నం–పూరీ(08313) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన పూరీలో బయల్దేరాల్సిన పూరీ–విశాఖపట్నం(08314) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.